క్లుప్తంగా

భద్రకాళీ అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే

జగిత్యాలటౌన్: జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ వరంగల్‌లోని భద్రకాళీ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా వరంగల్ పర్యటనలో ఉన్న సంజయ్‌కుమార్ శనివారం ఉదయం భద్రకాళీ అమ్మవారితో పాటు అభయాంజనేయస్వామి వారిని దర్శించుకున్నారు.

దేశంలో మానవ వనరులు అనేకం

జగిత్యాల: మానవ వనరులు కలిగి ఉన్న దేశం భారతదేశమని బీఎస్ రావు ఫౌండేషన్ చైర్మన్ బీఎస్‌రావు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎస్సీ స్టడీ సర్కిల్‌కు బీఎస్.రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు బుక్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న ఉన్నత స్థానానికి చేరుకుని ప్రతి ఒక్కరూ దేశం కోసం బాధ్యతగా పనిచేయాలన్నారు. నిరుద్యోగులకు పుస్తకాలు అందించిన బీఎస్‌రావును అధికారులు అభినందించారు. కార్యక్రమంలో షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి రాజ్‌కుమార్, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి చిత్రు, స్టడీ సర్కిల్ డైరెక్టర్ నరేశ్ పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లమ్మ తల్లి ఊరేగింపు



ఉత్సవమూర్తులను తీసుకవెళ్తున్న భక్తులు

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని రేణుకాఎల్లమ్మ తల్లి ఉత్సవాల్లో భాగంగా శనివారం ఎల్లమ్మ తల్లి ఉత్సవమూర్తిని ఘనంగా గీత కార్మికులు ఊరేగించారు. గీత కార్మిక సంఘ భవనం నుంచి ఎల్లమ్మ తల్లి ఉత్సవ విగ్రహాన్ని గ్రామ వీధుల గుండా ఊరేగింపుగా ఆలయం వరకు ఊరేగించి , ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గీత కార్మిక సంఘ సభ్యులు పాల్గొన్నారు.

డ్రైయినేజీ పనులు రద్దు చేసి టెండర్లు పిలవాలి



నిర్మాణానికి నోచుకోని డ్రైయినేజీ

జగిత్యాల: తహసీల్ చౌరస్తా నుంచి టవర్‌కు వెళ్లే రోడ్డులో పాడైన డ్రైయినేజీ మరమ్మతులకు నిధులు మంజూరు కాగా, పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు చేయడం లేదని, 35వ వార్డు కౌన్సిలర్ అనుమల్ల జయశ్రీ శనివారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కాంట్రాక్టర్ ఇష్టం వచ్చినప్పుడల్లా డ్రైయినేజీ నిర్మిస్తున్నాడని, దీంతో వల్ల ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, వెంటనే కాంట్రాక్టర్ బ్లాక్‌లిస్ట్‌లో పెట్టి తిరిగి టెండర్ పిలవాలన్నారు.అలాగే మిషన్ భగీరథ పైప్‌లైన్ మూడేళ్లు అవుతున్నా కనీసం ఇవ్వలేదని, ప్రజలకు ఇబ్బందులు అవుతున్నాయన్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు.

తాటిపల్లిలో బోర్‌వెల్స్ ప్రారంభం



బోర్‌వెల్ ప్రారంభించిన సంస్థ ప్రతినిధులు

మల్యాల: మండలంలోని తాటిపల్లి ఎస్సీ కాలనీ, బీసీ కాలనీల్లో ఫాతిమానగర్ అడోరేషన్ సొసైటీ ఆధ్వర్యంలో వేసిన బోర్‌వెల్స్ వేసి, శనివారం సంస్థ ప్రతినిధులు స్థానికులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు డైరెక్టర్ సిస్టర్ ప్రీతా మాట్లాడుతూ గ్రామీణప్రాంతాల్లో తాగునీటి సమస్య తీర్చేందుకు బోర్‌వెల్స్ వేస్తున్నామన్నారు. కార్యక్రమంలో దొంగ ఆనందరెడ్డి, ప్రాజెక్టు కోఆర్డినేటర్ దీప్తి, సిస్టర్ అరుణ, ప్రతినిధులు మర్రి మల్లేశం, నరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, రమేశ్, ప్రవంతి, మౌనిక, స్థానికులు పాల్గొన్నారు.

చివరి ఆయకట్టుకు నీరందించేలా...

- ఉప కాలువల్లో పూడికతీత పనులు
- 5 డిస్ట్రిబ్యూటర్లలో జోరుగా పనులు
- సాగులోకి వందల ఎకరాలు



డిస్ట్రిబ్యూటర్ కాలువల్లో పూడిక తీస్తున్న ఉపాధి కూలీలు

ఇబ్రహీంపట్నం: మండలంలోని చివరి ఆయకట్టు సాగునీరందించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కాకతీయ కాలువ నుంచి నీళ్లు ఉప కాలువలకు వెళ్లే చివరి ఆయకట్టు భూములకు ఖరీఫ్, రబీ పంటలకు నీళ్లందించేందుకు ఉపాధి హామీలో రూ. 12.21 లక్షలతో ఉపాధి కూలీలతో పూడికతీత పనులను పూర్తి చేస్తున్నారు. మండలంలోని డిస్ట్రిబ్యూటర్లు 21, 22,24,25,29 ఉండగా , ఇందులో డిస్ట్రిబ్యూటర్ 22, 24,25 లలో 16.5 కిలోమీటర్ల పొడవునా ఉపకాల్వలు పూడికను తీసి కాలువలో నీళ్లు వెళ్లేందుకు సిద్ధం చేస్తున్నారు. అలాగే ఉపకాల్వల నుంచి 18 పంటకాలువలకు 27 కిలోమీటర్ల పొడవున పూడికతీసి కాల్వల ద్వారా పంటలకు నీళ్లందేలా సిద్ధం చేస్తున్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయగానే ఉప కాల్వల ద్వారా చివరి వరకు ఆయకట్టు భూములకు నీళ్లు అందించేందుకు ఉపకాలువలు, పంట కాల్వలను పూడిక, పిచ్చి మొక్కలను తొలగించి రైతులు పంటలు పండించేందుకు సిద్ధం చేశారు. డిస్ట్రిబ్యూటర్ 21,22లో 34.76/1 ఎకరాల్లో, డిస్ట్రిబ్యూటర్ 24,25లో 3844 ఎకరాల్లో కాల్వల ద్వారా రైతుల పంటలకు నీళ్లు అందుతాయి. కాలువల్లో పూడిక, పిచ్చి మొక్కలు ఉండటంతో చివరి ఆయకట్టు భూములకు నీళ్లు అందలేదు.దీంతో ఉపాధి హామీలో కాలువల మరమ్మతు పనులు చేపట్టారు.ఎస్సారెస్పీ నీళ్లు రాగానే కాకతీయ కాలువకు నీటిని విడుదల చేసి ఉపకాలువల ద్వారా ఖరీఫ్, రబీ సీజన్లలో రైతులకు నీళ్లు ఇచ్చేందుకు గాను అధికారులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఉపకాలువల ద్వారా వందలాది ఎకరాల్లో పంటలు పండించుకునేందుకు రైతులు ఎదురుచూస్తున్నారు.

ఎస్సారెస్పీ నుంచి నీటిని విడుదల చేసి చెరువులను, కుంటలను నింపాలి

డిస్ట్రిబ్యూటర్ కాలువల నుంచి పంట పొలాలకు వెళ్లే కాల్వలకు, కుంటలు, చెరువులు నింపేందుకు ఉన్న కాల్వలలో కూడ పూడిక తీసి కుంటలు, చెరువుల్లోకి నీళ్లు వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



కబ్జాకు గురవుతున్న ఉపకాలువలు

డిస్ట్రిబ్యూటర్ కాలువల నుంచి పంట పొలాలకు వెళ్లే ఉపకాలువల్లో పూడికలు తీసేవాళ్లు లేకపోవడంతో రైతులు కాల్వలను కబ్జా చేసి, దుక్కి దున్నడం వలన కాలువల ఉనికి కోల్పోయి పొలాలకు నీళ్లు రాకుండా పోతున్నాయి. ఎస్సారెస్పీ అధికారులు చొరవ చూపి ఉపాధి హామీలో కూలీలతో కాలువల్లో పూడిక తీయించి కబ్జాకు గురి కాకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

ఉపాధి కూలీలతో పూడిక తీయిస్తున్నాం



డిస్ట్రిబ్యూటర్ కాలువల్లో పూడికలు, పిచ్చి మొక్కలు తొలగించేందుకు గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద రూ. 12.21 లక్షలు మంజూరు అయ్యాయి. ఆయకట్టు చివరిభూములకు నీళ్లందేలా డిస్ట్రిబ్యూటర్ కాల్వల్లో ఉపాధి కూలీలతో పూడిక, పిచ్చి మొక్కలను తొలగించే పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ సీజన్‌లో చివరి ఆయకట్టుకు నీరందిస్తాం.

– రాజేందర్ రెడ్డి,
ఇన్‌చార్జి, ఎంపీడీవో,ఇబ్రహీంపట్నం

విత్తనాల కొనుగోళ్లలో జాగ్రత్తలు తీసుకోవాలి



మల్లాపూర్ మండలంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ లావణ్య

మల్లాపూర్/సారంగాపూర్/ఇబ్రహీంపట్నం/మల్యాల/మెట్‌పల్లిరూరల్/ కోరుట్ల రూరల్/ రాయికల్/ వెల్గటూర్/మేడిపల్లి: విత్తనాల కొనుగోళ్లలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరుట్ల ఏడీఏ లావణ్య అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో శనివారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు కొనే విత్తనాలకు సంబంధించిన బిల్(రశీదు) తీసుకోవాలన్నారు.

గ్రామాల్లో ఏవోల అవగాహన

కోరుట్ల మండలం, సారంగాపూర్,బీర్‌పూర్ మండలాలు, ఇబ్రహీంపట్నం,మల్యాల మెట్‌పల్లి, రాయికల్, మేడిపల్లి, వెల్గటూర్ మండలాల్లోని గ్రామాల్లో వ్యవసాయ అధికారులు రైతులకు నకిలీ విత్తనాలపై అవగాహన కల్పించారు. రైతులు నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి మోసపోవద్దన్నారు.గుర్తింపు పొంది లైసెన్స్ కలిగి ఉన్న డీలర్ల వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలని, కొనుగోలు రశీదు తప్పక తీసుకోవాలని, బిల్లును భద్రపరుచుకోవాలని సూచించారు. కార్యక్రమాల్లో ఏవోలు, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా బీరప్పస్వామి కల్యాణం



బీరప్ప స్వామి ఉత్సవ విగ్రహాలతో ఒగ్గు కళాకారులు

జగిత్యాలజోన్: మండలంలోని లక్ష్మీపూర్‌లో కుర్మ సంఘం ఆధ్వర్యంలో శనివారం బీరప్పస్వామి కామరాతీదేవి కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఒగ్గు కళాకారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి.

కుర్మపల్లిలో ఊర దండాలు

రాయికల్: మండలంలోని కుర్మపల్లిలో మహంకాళమ్మ బీరయ్య పండగ ఉత్సవాల్లో భాగంగా శనివారం గ్రామంలో పురవీధుల గుండా విన్యాసాలు చేస్తూ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు



రికార్డులు పరిశీలిస్తున్న ఏపీఎం

మల్లాపూర్: ధాన్యం కొనుగోళ్లలో నిర్వాహకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ఐకేపీ ఏపీఎం దేవరాజ్ అన్నారు. మండలంలోని రాఘవపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం సందర్శించి మాట్లాడారు. కొనుగోలు కేంద్రంలో ఇప్పటి వరకు 12,643 క్వింటాళ్ల ధాన్యం సేకరించి 44 లారీల్లో మిల్లర్లకు తరలించామన్నారు. డాటా ఎంట్రీ 4,164 క్వింటాళ్ల వరకే నమోదు చేయడంపై నిర్వహకులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. 44 ట్రక్‌షీట్లకు గాను 32 మాత్రమే తెప్పించడమేంటని ప్రశ్నించారు. కొనుగోళ్ల వివరాల నమోదు, ట్రక్‌షీట్లను తెప్పించడంలో జాప్యం చేయవద్దని హెచ్చరించారు. రెండు రోజుల్లో పెండింగ్ వర్క్ పూర్తి చేయాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల పర్యవేక్షణ సమర్థవంతంగా నిర్వహించాలని సీసీలకు సూచించారు. కార్యక్రమంలో ఐకేపీ సీసీ రాజు, కేంద్రం నిర్వహకులు రమ్య, సాగర్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతోనే మానసిక ప్రశాంతత



భగవద్గీత బోధిస్తున్న ప్రబోధక్

మల్లాపూర్: ఆధ్యాత్మికతతోనే ప్రజలు మానసిక ప్రశాంతత పొందుతారని గీతా సత్సంగం వ్యవస్థాపకులు, ఉత్తమ గీత ప్రబోధక్ శ్రీ చీలమంతుల ఛత్రపతి అన్నారు. మండల కేంద్రంలోని శ్రీ వాసవీకన్యక పరమేశ్వరి ఆలయంలో శనివారం రాత్రి గీతా సత్సంగం ఆధ్వర్యంలో 77వ గీతా జ్ఞానయజ్ఞం ప్రారంభించి భగవద్గీత ప్రవచనాలను బోధించారు. మనం చేసే ప్రతి సేవా కార్యక్రమాలలో దేవుని ఆశీర్వాదం ఉంటుందన్నారు. హిందువుల పవిత్ర గ్రంథం భగవద్గీతను ప్రతి ఒక్కరూ చదవాలన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ రిజీయన్ చైర్మన్ శివ శ్రీనివాస్, రిజీయన్ కార్యదర్శి రుద్ర రాంప్రసాద్, ఆధ్యాత్మికవేత్తలు శివ బుచ్చయ్య, రాంకిషన్, మోర సతీశ్ పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

కోరుట్ల: పట్టణంలోని అయ్యప్ప గుట్టపై ఉన్న అయ్యప్ప ఆలయ అబివృద్ధి పనుల కోసం పట్టణానికి చెందిన మచ్చ రమేశ్–అన్నపూర్ణ దంపతులు రూ.51 వేల విరాళం శనివారం అందజేశారు. రూ. 50 లక్షల వ్యయంతో చేపట్టే అభివృద్ధి పనుల్లో భాగంగా ఇప్పటికే పలువురు దాతలు రూ.7.67 లక్షల విరాళాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ గౌరవ అధ్యక్షుడు చిద్రాల నారాయణ, ఆలయ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, పలువురు గురు స్వాములు పాల్గొన్నారు.

ఇంటర్‌లో సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల: తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల సంస్థ పరిధిలోని నాన్ సీవోఈ విద్యాలయాల్లో 2024–25 విద్యా సంవత్సరానికి జూనియర్ ఇంటర్‌లో మిగిలిపోయిన సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు టీజీఎస్‌డబ్ల్యూ గురుకుల విద్యాలయాల సమన్వయాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. విద్యార్థులు ఈనెల 24 నుంచి 31 వరకు గురుకుల సొసైటీ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఒకేషనల్ కోర్సుల్లో సీట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. మేడిపల్లిలో ఎంపీసీ, బైపీసీ, గొల్లపల్లిలో ఎంఈసీ, సీఈసీ, జగిత్యాలలో బాలికలకు బైపీసీ, మెట్‌పల్లిలో బాలికలకు సీఈసీ, ఒకేషనల్ కోర్సుల్లో సీట్లున్నాయని తెలిపారు. ఉచిత భోజన వసతి,పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలు అందిస్తామని పేర్కొన్నారు.

కుక్కల దాడిలో గొర్రెలు మృతి



వైద్యం చేస్తున్న పశువైద్యాధికారి నరేశ్

రాయికల్: మండలంలోని సింగరావుపేట గ్రామ శివారులో కిష్టంపేటకు చెందిన నాగెల్లి మల్లయ్య మూడు గొర్రెలు, సింగరావుపేటకు చెందిన పెద్దగంగ ఓదెలుకు చెందిన రెండు, పెద్ది బాలయ్యకు చెందిన ఒకటి, బర్కం మల్లేశ్‌కు చెందిన ఒక గొర్రెకు శనివారం అడవికుక్కలు దాడి చేయడంతో తీవ్రగాయాలు కాగా, నాగెల్లి మల్లయ్యకు చెందిన మూడు గొర్రెలు మృతిచెందాయి. అల్లీపూర్ పశువైద్యాధికారి డాక్టర్ నరేశ్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని చికిత్స అందించారు. కాగా, వీటి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు.

క్రీడాకారులను ప్రోత్సహించడం అభినందనీయం



కాంతాకుమారిని సన్మానిస్తున్న నిర్వాహకులు

గొల్లపల్లి: గ్రామీణ యువతను క్రీడల వైపు ప్రోత్సహించడం అభినందనీయమని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సతీమణి కాంతాకుమారి అన్నారు. మండలంలోని భీంరాజ్‌పల్లిలో నిర్వహించిన భీమ్‌రాజ్ పల్లి బొమ్మెన కుమార్ క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ముగ్గుల పోటీల్లో విజేతలకు ఆమె ట్రోఫీలు బహూకరించారు. బార్ అసోసియేషన్ జిల్లా మాజీ అధ్యక్షుడు తాండ్ర సురేందర్ మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహిస్తూ బహుమతులను ప్రదానం చేయడం అభినందించదగిన విషయమన్నారు. ఈ సందర్భంగా టోర్నమెంట్ నిర్వాహకులను క్రీడాకారులు సన్మానించారు. లీడ్ ఇండియా రాష్ట్ర శిక్షణ సమన్వయకర్త తాడూరి శ్రీనివాసాచార్య, మండల సమన్వయ కర్త జక్కుల తిరుపతిరావు టోర్నమెంట్ సమన్వయకర్తగా వ్యవహించారు. మాజీ సర్పంచ్ రేవల్ల సుజాత, పురంశెట్టి వెంకటేశం, తాడూరి సత్యనారాయణ, కిష్టంపేట రమేశ్‌రెడ్డి, పల్లెర్ల వీరేశం, కంది స్వామి తదితరులు పాల్గొన్నారు.

బహుజన రాజ్యం సాధిస్తాం



శ్రీకాంత్‌ను సన్మానిస్తున్న డీఎస్పీ నాయకులు

జగిత్యాలటౌన్: విశారదన్ మహారాజ్ నాయకత్వంలో బహుజన రాజ్యం సాధిస్తామని ధర్మసమాజ్ పార్టీ రాష్ట్ర నాయకుడు శ్రీకాంత్ మహారాజ్ అన్నారు.జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన డీఎస్పీ సమీక్షా సమావేశానికి శ్రీకాంత్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జనాభాలో 93శాతం ఉన్న పీడిత ప్రజల పక్షాన పోరాటం చేస్తామన్నారు. ఈ సందర్భంగా జిల్లాకు చెందిన పలువురు బీఎస్పీ నాయకులు డీఎస్పీలో చేరారు. జిల్లా ఇన్‌చార్జీలు శ్రీకాంత్, హరీశ్ గౌడ్ పలు అంశాలపై స్థానిక నాయకులతో చర్చించి జిల్లాలో పార్టీ విస్తరణకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీఎస్పీ జిల్లా కమిటీ సభ్యులు దుబ్బ చైతన్యకుమార్, తిరుపతి, నాయకులు గంగరాజం, శివకోటేశ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

బీడీ కార్మికులకు వేతనాల పెంపు



చర్చల్లో కార్మిక సంఘాల నేతలు

జగిత్యాలటౌన్: బీడీ తయారీ సంస్థల యాజమాన్యాలతో కార్మిక సంఘాలు జరిపిన చర్చలు విజయవంతమై బీడీ కార్మికుల వేతనాలు పెరిగాయని తెలంగాణ స్టేట్ బీడీ కార్మిక సంఘ్(బీఎంఎస్) రాష్ట్ర అధ్యక్షుడు ఎం సుధీర్‌కుమార్ శనివారం తెలిపారు. రాష్ట్రంలోని ఏడు లక్షల మంది బీడీ కార్మికుల వేతనాల పెంపు కోసం కార్మిక సంఘాలు నోటీసులు ఇవ్వగా, శనివారం హైదరాబాద్‌లో కార్మిక సంఘాలు, యాజమాన్యంతో జరిగిన చర్చల ఫలితంగా కార్మికుల వేతనాల పెంపు జరిగిందని సుధీర్ తెలిపారు. బీడీలు చుట్టే వారికి 4.25పైసలు, నెల వారి వేతన ఉద్యోగులకు రూ.1700, ప్యాకింగ్ కార్మికులకు రూ.3650 వేతనం పెంచినట్లు తెలిపారు. పెరిగిన వేతనాలు తక్షణమే అమలు చేసేందుకు బీడీ కంపెనీలు అంగీకరించాయని పేర్కొన్నారు.

ఈత చెట్లు దగ్ధం

ఇబ్రహీంపట్నం: మండల కేంద్రం శివారులోని ఈత వనానికి శనివారం మంటలు అంటుకుని దగ్ధమయ్యాయి. మెట్‌పల్లి ఫైరింజన్‌కు సమాచారం ఇవ్వగా.. సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. అప్పటికే రెండు వేల వరకు చెట్లు దగ్ధమైనట్లు గీత పారిశ్రామిక సంఘం అధ్యక్షుడు చెట్లపల్లి సత్యనారాయణ, మండల అధ్యక్షుడు సాయిరాం తెలిపారు. గీత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

మన్నెగూడెంలో..

మేడిపల్లి: భీమారం మండలం మన్నెగూడెంలో సుమారు వెయ్యి ఈత, తాటిచెట్లు అగ్నికి ఆహుతి అయ్యాయి. గ్రామస్తులు ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వగా.. సిబ్బంది వచ్చి మంటలు ఆర్పారు. చుట్టుపక్కల రైతులు పొలంలో నిప్పుపెట్టగా.. ఆ మంటలు వ్యాపించినట్లు చర్చించుకుంటున్నారు.

వరకట్నం వేధింపుల్లో అత్తింటివారిపై కేసు

సారంగాపూర్: వరకట్న వేధింపుల కేసులో అత్తింటి వారిపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై దత్తాద్రి తెలిపారు. మండలంలోని పెంబట్ల గ్రామానికి చెందిన పస్తం భాగ్య అనే మహిళకు 9 ఏళ్ల కిత్రం జగిత్యాల రూరల్ మండలం వెల్దుర్తి గ్రామానికి చెందిన జలేందర్‌తో వివాహం జరిగింది. వివాహం జరిగినప్పటి నుంచి రూ.50 వేల అదనపు కట్నం తేవాలని అత్తింటివారు వేధించారు. ఈ నెల 20న పెంబట్లలోని తల్లి గారింటి వద్ద భాగ్య ఉంటుండగా, అక్కడికి వచ్చి సైతం భర్త వేధించారు. దీంతో వేధింపులు భరించలేక భర్త జలేందర్, అత్త రాజమ్మపై ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

కొయ్యకాళ్లకు నిప్పు.. వ్యాపించిన మంటలు



మెట్‌పల్లిరూరల్: వరి కొయ్యకాళ్లకు నిప్పు పెట్టడంతో మంటలు వ్యాపిస్తూ అర్ధరాత్రి ఇళ్ల సమీపానికి చేరుకున్నాయి. దీంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. మెట్‌పల్లి మండలం ఆత్మనగర్ –రామలచ్చక్కపేట శివారులో రైతులు శుక్రవారం వరి కొయ్యలకు నిప్పంటించారు. అర్ధరాత్రి సమయంలో మంటలు ఆత్మనగర్‌లోని ఇళ్ల సమీపానికి చేరుకున్నాయి. గ్రామస్తులు అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం చేరవేశారు. వెంటనే స్పందించిన అగ్నిమాపక శాఖ సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలను పూర్తిగా ఆర్పివేశారు.

సమాచారం..

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జగిత్యాలరూరల్: జిల్లా కేంద్రం టౌన్–1 సెక్షన్ పరిధిలోని రాంబజార్, పురాణిపేట, ఎల్లీరామ్ లాడ్జి, టవర్ ఏరియా, న్యూ బస్టాండ్ ఏరియా, బీఎస్ఎన్ఎల్ టవర్, యావర్‌రోడ్ లెఫ్ట్‌సైడ్ ఫైర్‌స్టేషన్ నుంచి తహసీల్ చౌరస్తా వరకు, బాలాజీ టాకీస్ ఏరియా, ద్వారకనగర్, కాంతిభవన్ పక్కన, మార్కెట్‌బ్యాక్‌సైడ్, శ్రీరాంనగర్ ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ అశోక్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ధర్మపురి: పట్టణంలో ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ రవి తెలిపారు. పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు.

రేపు సామాజిక తనిఖీ ప్రజా వేదిక

ధర్మపురి : మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 27న మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రవీందర్ తెలిపారు. మండలంలో ఏడాదిపాటు ఉపాధిహామీలో చేపట్టిన పనులపై చేసిన నివేదికలు చదివి వినిపిస్తారని పేర్కొన్నారు.

28న మండల సర్వసభ్య సమావేశం

మల్లాపూర్: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఈ నెల 28న ఉదయం 11గంటలకు మండల పరిషత్ అధ్యక్షురాలు కాటిపెల్లి సరోజన అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాజేందర్‌రెడ్డి శనివారం తెలిపారు. సమావేశంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్‌కుమార్ పాల్గొననున్నారని, జెడ్పీటీసీ, మండల కో–ఆప్షన్ సభ్యుడు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు సకాలంలో హాజరు కావాలని పేర్కొన్నారు.

3న మండల సర్వసభ్య సమావేశం

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండల సర్వసభ్య సమావేశం జూన్ 3 సోమవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ మంగళారపు మహేశ్ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రమాదేవి తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు అందరూ సకాలంలో హాజరు కావాలని కోరారు.